జీడిపిక్కలను అర్‌బికేల ద్వారా కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - కవిటి : జీడి పిక్కలు బస్తా 16 వేల రూపాయలు మద్దతు ధర నిర్ణయించి ఆర్.బి.కె.ల ద్వారా ప్రభుత్వ మే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన కవిటి లో రైతు సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు కే మోహన్ రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంగారు లక్ష్మీనారాయణ, జీడి రైతుల సంఘం కన్వీనర్ అజయ్ కుమార్, జీడి రైతు సంఘం నాయకులు బత్తిన లక్ష్మీ నారాయనల ఆధ్వర్యంలో జీపు జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఉద్దాన ప్రాంత జీడి రైతులు సంఘీభావం తెలియజేశారు. అనంతరం కవిటి, ముత్యాలపేట, బైరిపురం, రాజపురం గ్రామాల మీదుగా జీపు జాత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిటిలో రైతు సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షులు కే మోహన్ రావు మాట్లాడుతూ 80 కిలోల జీడి పిక్కల బస్తాకు 16 వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించి,ఆర్బికేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంట విస్తరణకు, నిర్వహణకు గతంలో లాగా పున రుద్దరించాలని కోరారు. రాయితీలు అంద జేయాలని అన్నారు.జీడి తోటలలో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలని అలాగే జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరం జీడి తోట అభివృద్ధికి 94 వేల రూపాలు రైతులకు క్షేత్ర స్థాయిలో అందజే యాలన్నారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని కోరారు. రైతులు సాగు విస్తీర్ణం నమోదు చేసి,జీడి పంటకు వాతావరణ భీమా అమలు చేయాలని కోరారు. జీడి పంట పండించే ప్రాంతంలో జీడి పిక్కలు,జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జీడి రైతులకు జీడి పిక్కలు ఆరబెట్టు కునేందుకు టార్పాలిన్ లు ఉచితంగా అందించాలని అన్నారు.

ఆంధ్ర రాష్ట్రంలో 8 జిల్లా లలో విస్తరించి ఉన్న విశాల సముద్ర తీరం వెంబడి ఇటు ఉద్దానం,అటు గిరిజన ప్రాంతాల్లోనే కాకుండా మైదాన ప్రాంతంలో కూడా లక్షల ఎకరాలలో జీడి పంట విస్తీర్ణం పెరిగిందని తెల్ల బంగారంగా ఖ్యాతి కెక్కి అంతర్జాతీయంగా మన దేశానికి కోట్ల రూపాయల విదేశీమారక ద్రవ్యం తెచ్చి పెడుతున్న జీడిరైతులు ఏళ్ల తరబడి పాలకుల నిర్లక్ష్యానికి, వ్యాపారుల దోపిడీకి గురై తీవ్ర ఆర్థిక నష్టాలలో కొట్టు మిట్టాడుతున్నారని అన్నారు.గత 2018-19 ఆర్థిక సంవత్సరంలో 80 కేజీల జీడి పిక్కల బస్తా 14 వేలు నుండి 15వేలు రూపాయలు పైన ధర పలికితే ప్రతి ఏడాది రేటు క్షీణించి 7,500 వేల రూపాయల నుండి 8 వేల రూపాయలకు దిగజారి గిట్టుబాటు ధర లేక జీడి రైతులు ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తు నుండి విక్రయం వరకు అన్ని పంటల కు మద్దతు ధర నిర్ణయించి,ఆర్.బి.కె.ల ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటిస్తున్నది కాని జీడి పంటకు మాత్రం మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయడంలేదు ఎందుకని ప్రశ్నించారు. జీడి పండించే రైతులను వ్యాపారుల దయా ధాక్షిణ్యాలకు వదిలేస్తున్నదని లాభమే పరమావధిగా భావించిన వ్యాపారులు సిండికేట్ గా మారి జీడి పిక్కల ధర అమాంతం తగ్గించే స్తున్నారని అన్నారు. ఈ ఏడాది వ్యాపారులు పరిశ్రమలు బంద్ చేసి పిక్కలు కొనడం మానేశారని ఈ పరిస్థితులలో ప్రభుత్వమే ధర నిర్ణయించి జీడిపిక్కలు కొనుగోలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ జీడి రైతుల సంఘం డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్దాన ప్రాంత జీడి రైతులు బెందాళం వెంకటేశ్వరరావు, ఆరంగి మధు, బల్లెడ జయప్రకాష్, ఆరంగి కృష్ణారావు, ఆరంగి త్రివిక్రమ రావు, పిరియా ప్రసాదరావు, జగదీష్, బల్లెడ శంకర్రావు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు కరోనా సమయంలో వాలంటీర్ల సేవలు కనిపించలేదా : ఎమ్మెల్యే రెడ్డిశాంతి

విశాలాంధ్ర - పాతపట్నం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేతగా. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను, ఇబ్బందులను తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు సంక్షేమ పథకాలను సకాలంలో అవినీతి రహితంగా రాజకీయాలకు అతీతంగా అందించేందుకే బృహత్తరమైన వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి 2,40,000 మంది వాలంటీర్లను నియమించి దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ స్వరాజ్యాన్ని అందించారని ఆమె అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

నేరుగా ఇంటి వద్దకే అందిస్తూ, రేషన్, పెన్షన్ వంటి పలు సంక్షేమ పథకాలను సకాలంలో అందించడం ద్వారా దేశంలోని పలు రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థపై అధ్యాయనం చేస్తున్నాయన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో అగ్రరాజ్యాలే హడలిపోయినప్పుడు ధైర్యంగా ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే, కోవిడ్ కిట్లు అందిస్తూ డెత్ రేటు తగ్గించేందుకు ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించిన ఘనత వలంటీర్లదేనని, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని సాక్షాత్తు దేశ ప్రధానే కొనియాడారని ఆమె గుర్తు చేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 1500 మంది వలంటీర్ల తరుపున ఒక మహిళా ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ తక్షణమే వలంటీర్లందరికీ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. జగనన్న సంక్షేమ పాలన చూసి ఓర్వలేక వేరే వాళ్ళు ఇచ్చిన స్క్రిప్ట్ పవన్ కళ్యాణ్ చదువుతూ మహిళల అపహరణకు వలంటీర్ల డేటాను సాకుగా చూపుతూ విమర్శలు చేయడం వల్ల వలంటీర్ల, వారి కుటుంబాల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కొండాల అర్జునుడు, వైస్ చైర్మన్ మద్దు తాతయ్య మాష్టారు వైకాపా నాయకులు బి. నారాయణ మూర్తి, ఎరుకోల వెంకటరమణ, మాష్టారు, మంచు చంద్రయ్య, తూలుగు ప్రవీణ్, మోహన్, గోకవలస రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు నెలాఖరు నాటికి పూర్తి కావాలి : మంత్రి బొత్స

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు వద్దకు చేర్చడంలో అధికారులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు నెలాఖరు నాటికి పూర్తి కావాలని సూచించారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనులు వేగవంతంగా చేసి నిర్దేశించిన సమయానికి భవనాలు అప్పగించాలని గుత్తేదారులను మంత్రి ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆమదాలవలస నియోజకవర్గ సమీక్ష సమావేశానికి ఇంచార్జ్ మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షత వహించారు. వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు నిధులు కేటాయించామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇతర గ్రాంటుల కింద మంజూరైన పనులు ఇంజినీరింగ్ అధికారులు సకాలంలో పూర్తి చేసి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. శాసనసభాపతి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలని ఆ దిశగా అందరూ అడుగులు వేసి ముందుకు వెళ్లాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పనులు పురోగతిపై మంత్రి సమీక్షించారు. అనంతరం గృహ, విద్యుత్, విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలు, ఇతర శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వారానికి ఒక నియోజకవర్గం చొప్పున సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి అన్నారు. ప్రతీ శుక్రవారం విధిగా ఈ సమీక్ష ఉంటుందని అన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే స్పీకర్, జిల్లా కలెక్టర్ కి తెలియజేస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. శాసనసభాపతి తమ్మినేని సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గ%శీ%గా ఆమదాలవలసను తయారు చేయుటకు అన్ని రకాల సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో సహకరిస్తే ప్రభుత్వం చేపడుతున్న ఫలాలు ప్రజలకు అందుతాయని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం. నవీన్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇన్‌చార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి మురలీ కృష్ణ, శ్రీకాకుళం రెవిన్యూ డివిజినల్ అధికారి బి. శాంతి, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ వెంకట్రామాన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డి.ఆర్.డి.ఎ, పి.డి విద్యాసాగర్, సి. పి.ఓ లక్ష్మి ప్రసన్న, ఆమదాలవలస నియోజకవర్గంలో వివిధ శాఖల మండల అధికారులు, జెడ్పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

కలాం అవార్డ్‌కు యువవిద్యావేత్త అంపిలి ఎంపిక

విశాలాంధ్ర - కొత్తూరు : మాజీ రాష్ట్రపతి, భారత రత్న ఏపిజె అబ్దుల్ కలామ్ ఇన్సపేరేషన్ జాతీయ అవార్డు కొత్తూరు మండలంకు చెందిన అంపిలి ప్రశాంత్ కుమార్ ఎంపి కయ్యారు. విద్యలో, సేవా కార్యక్రమంలో యువతకు మార్గ దర్శిగా నిలిచిన ప్రశాంత్ కొత్తూరు మండల పరిషత్ సలహా సభ్యులుగా ఉన్నారు. ఫిలాంత్రో పిక్ ఆఫ్ ఇండియా ప్రశాంత్ కుమార్‌ను అబ్దుల కలాం ఇన్సపేరేషన్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 27 తేదీన విజయవాడలో కలామ్ వర్ధంతి సంద ర్భంగా సదరు సంస్థ ఏర్పాటు చేసిన వేదికపై అవార్డ్ గ్రేహిత ప్ర శాంత్‌కు సన్మానం చేసి బహుక రిస్తారు. ఈ కార్యక్రమనికి చీఫ్ గెస్ట్‌గా ఎంపీ నందిగామ సురేష్, వివిద హెూదల్లో ఉన్నవారు హాజరవుతారు.

పాఠశాలకు టేబుల్స్ వితరణ

విశాలాంధ్ర - పలాస : పలాస ప్రాథమి కోన్నత పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థుల సౌకర్యార్థం పలాసకు చెందిన బద్రి గోపాల్ శు క్రవారం నాలుగు టేబుల్స్‌ను వితరణగా అందించారు. పాఠశాలలో జరిగిన కార్య క్రమంలో ఉపా ధ్యాయుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు రత్నాల సోమేశ్వర రావుకు అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌ను ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

నౌపాడ పోలీస్ స్టేషన్లో ఎస్పీ తనిఖీలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : వార్షిక తని ఖీల్లో భాగంగా నౌపాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా పోలీ సులతో, ఎస్పీ సమావేశం నిర్వ హించి, వారు నిర్వహించే విధుల పట్ల పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళల రక్షణ, పొక్సో చట్టం, దిశ యాప్ లపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూ చించారు. గ్రామాల్లోని అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని మరియు నాటుసారా, మద్యం, గంజాయి ల అక్రమ రవాణా, విక్ర యాలుకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియ జేయాలని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ రికార్డులను, ముఖ్యమైన కేసు ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. కానిస్టేబుళ్లు వారి దత్తత గ్రామాలను క్రమంతప్పకుండా సందర్శించాలని, గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరుగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు అభినందనీయం

వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు అభినంద నీయం వన్ టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ అన్నారు. పట్టణ పరిధిలో ఉన్న ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గణేష్ ఆలోచన మేరకు మంచి నీటి సౌకర్యం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు కల్పించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పోలీస్ స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పంపుసెట్ ను స్టేషన్ ఎస్ఐ బి గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. తమ స్టేషన్ లో మంచినీటి పంపు సెట్‌ను ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, క్లబ్ ప్రెసిడెంట్ పొన్నాడ రవికుమార్, జోన్ చైర్ పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, సెక్రెటరీ టి.రాంగోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, ఊణ్ణ కిరణ్, కామేష్, పొడుగు చరణ్, రాజు, లయన్స్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సునీల్, రామ్మోహన్ పాల్గొన్నారు.

డాక్టర్ కణితి విశ్వనాథం మృతికి పార్లమెంట్ సమావేశాల్లో సంతాపం తెలపాలి

లోక్‌సభ స్పీకర్‌కి ఎంపీ లేఖ

విశాలాంధ్ర - అరసవల్లి : గత ఏప్రిల్ లో మరణించిన మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం మృతి పట్ల ఆయన గౌరవార్థం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో సంతాప తీర్మానం ప్రవేశ పెట్టి ఒక నిమిషం మౌనం వ్యక్త పరచాలని శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కు లేక ద్వారా కోరారు. డా. కణితి విశ్వనాథం తన నియోజకవర్గ ప్రయోజ నాలకు ప్రాతినిధ్యం వహించడానికి అవిశ్రాంతంగా పనిచేసి అంకిత భావం కలిగిన ప్రజా సేవకుడని గా కొనియాడారు. అతను పార్లమెంటులో ఎంతో గౌరవించబడ్డారని, తన పని ద్వారా మన సమా జానికి గణనీయమైన కృషి చేశారని తెలిపారు. నిష్క్రమించిన డాక్టర్ కణితి విశ్వనాథం గౌరవార్థం రాబోయే వర్షాకాల సమావేశాలలో ఆయన స్మృతిని గ పార్లమెంట్ లోక్ సభ ద్వారా అతని కుటుంబ సభ్యులకు, ప్రియమైనవారికి సానుభూతిని తెలియజేయడానికి ఒక్క క్షణం మౌనం పాటించాలని లోక్ సభ స్పీకర్ కు లేఖలో ఎంపీ కోరారు. ఇది ఒక గొప్ప వ్యక్తిత్వం కలిగిన మనిషికి సంతాపాన్ని తెలియ జేయడానికి, అతను వదిలిపెట్టిన వారసత్వానికి నివాళులు అర్పించడం మన కర్తవ్యం అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఆయన మృతి జిల్లా ప్రజలకు తీరని లోటని తెలిపారు.

జన్మదినోత్సవం సందర్భంగా త్రాగునీటి బావి ఏర్పాటు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : మండలం బోరుభద్ర నివాసి, టెక్కలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ చింతాడ దిలీప్ కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా, బోరుభద్ర భవాని సన్నిధానం వద్ద తన సొంత నిధులతో త్రాగు నీటి బావి త్రవ్వించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, ఎంపీటీసీ చింతాడ జయ చిన్నారావు మంచినీటి బావి ఏర్పాటుకు పూజలు నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు ముద్దపు రమణ మూర్తి, వైకాపా నాయకులు డాక్టర్ అప్పారావు, టైలర్ బొంగు ధర్మారావు భవాని భక్తుల గురు భవాని కొప్పల రవికుమార్, చింతాడ రేవంత్, లోళ్ళ అప్పారావు, వల్లభ వసంతరావు తోపాటు పలువురు భవాని భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం పెద్దమురారిపురం గ్రామంలో శుక్రవారం జెమ్స్ వైద్యుల ఆధ్వర్యంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంనకు విశేష స్పందన లభించిందని, సంస్థ వ్యవస్థాపకులు విజయకుమార్ తెలిపారు. ఇటీవల చాలా మంది గుండెపోటు, క్యాన్సర్, కిడ్నీ సమస్యలతో తమ ప్రాణాలను కోల్పోతున్నారని, చాలా మంది అనారోగ్యాలకు కూడా గురవుతున్న కారణంగా ఉద్దాన ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరానికి సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ముని, గీత, రాజేష్, చేరిత్, అప్పలకొండ, వెంకటరమణ, విజయకుమార్, తిరువతిరావు, జెమ్స్ మేనేజర్ ఎ.వెంకటేష్, వజ్రపుకొత్తూరు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు బత్తిన తిరుపతి, రాహుల్, చంటి, ఆశా వర్కర్లులలతో పాటు తారక్, మురళీ, సునీల్, రామారావు, చలపతి, వెంకీ, మధు, నారాయణ, గణేష్, కిశోర్, హరిలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఐదుగురు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - పలాస : పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు టి.జ్యోషిక, ఎస్.రమ్య, ఎ.హ్యాపి, బి.పవిత్ర, కె.పూనారావు దొరలు ట్రిపుల్ ఐటికి ఎంపి కైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయుల బృందం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఐటికి ఎంపికైన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సరంలో ఎక్కువ మంది ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ముఖ్య అతిథిగా పాల్గొనగా మండల వ్యవసాయ సలహా మండలి నెలవారి సమావేశం వ్యవసాయాధికారి బి.నర్సింహ మూర్తి నిర్వహించారు. ప్రస్తుతం నెలకొని ఉన్న వర్షాభావ పరిస్థితులు వన వరి నారు పరిస్థితి సమీక్షించారు. జూలై మూడో వారం కూడా ఈ వర్షాభావ పరిస్థితులు కొనసాగితే వరి స్వల్ప కాలిక రకాలు విత్తనాలు అవసరం ఉంటాయని సభ్యులు లింగం జానకిరావు సూచించారు. ఎంపీపీ దాసు మాట్లాడుతూ ఇటీవల సోంపేటలో ప్రభుత్వం నెలకొల్పిన సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలల మీద రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. కొబ్బరి నాడుమడి క్షేత్రం బారువలో రాయితీపై కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, జీడి అంటులకు రైతు భరోసా కేంద్రంలో ధరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవిలత తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బి.వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బెంగుళూరులో యువ సైంటిస్టు మృతి

విశాలాంధ్ర - మందస : మండలం కుంటికోట గ్రామానికి చెందిన యువ సైంటిస్టు కిల్లి సునీల్‌కుమార్ (32) గురువారం బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బెంగుళూరులోని మీలాన్ అనే ఆర్గనైజేషన్‌లో సైంటిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. తాను నివాసముండే దగ్గరలో ఉన్న సంస్థ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు నడిచి వెళు తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. స్థానికులు ఆసుపత్రికి తర లించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈతనికి ఏడాది క్రితమే వివాహమైంది. సునీల్‌కుమార్ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కుంటికోట గ్రామస్తులు శోకసముద్రంలో మునిగిపోయారు.

పాటల పోరాట యోధుడు గరిమెల్ల

ప్రముఖ న్యాయవాది కొంక్యాన సుభాష్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ పాలకులపై పాటలనే ఈటెలుగా విసిరిన గొప్ప వాగ్గేయకారుడు గరిమెల్ల సత్యనారాయణ అని ప్రముఖ న్యాయవాది కొంక్యాన సుభాష్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెల్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నగరంలోని గాంధీ మందిరంలో కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గరిమెల్ల విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచనలు ద్వారా ఉద్యమానికి ఊతమిచ్చిన గొప్ప యోధుడు సిక్కోలుగలో జన్మించడం గర్వకారణమన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుపతిరావు మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో తన కలం, గళం ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టిన గొప్ప యోధుడు గరిమెల్ల అన్నారు. విశ్రాంత తెలుగు పండితుడు పైడి హరనాధరావు గరిమెల్ల పై తాను రచించిన గేయాలను, గరిమెల్ల స్వాతంత్ర్య పోరాటంలో ఆవిష్కరించిన గేయాలను ఆలపించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురలీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, మెట్ట అనంతభట్లు, కొంక్యాన వేణుగోపాల్, నక్కశంకరరావు, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి, డాక్టర్ బాడాన దేవభూషణ్, గుత్తు చిన్నారావు, పొన్నాడ రవి, కొంక్యాన శివశంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

విశాలాంధ్ర - నందిగాం : ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు అందుబాటులో ఎరువులు, పురుగు మందులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి అధికారులు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి శ్రీకాంత్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. కొన్నిచోట్ల రైతులు వేసిన వరి విత్తనాలు మొలకెత్తలేదని దీనిపై ఏ ఏ గ్రామాల్లో సమస్య ఉందో ఆయా గ్రామాల్లో సమాచారం సేకరించాలని సూచించారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పురుగు, మందులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అదమరిస్తే .. అంతే !

విశాలాంధ్ర - కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ కె.టి రోడ్డు గోతులతో అధ్వాన్నంగా తయారైంది. గతేడాది రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు కాలువలు నిర్మిస్తున్నారు. ఇంకా పనులు కొన సాగుతునే ఉన్నాయి. కాశీబుగ్గ నుంచి పలాస వెళ్లేందుకు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. చాలా చోట్ల పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడడంతో అనేక మంది వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చినుకు పడితే గోతుల్లో నీరు నిండిపోవడంతో గోతులు కనిపించక వాహనదారులకు తలనొప్పిగా తయారైంది. పనులు ఎప్పుడు జరుగుతాయో గాని, గోతులు పూడ్చాలని, ప్రమాదాలు జరిగితే దీనికి పాలకులు అధికారులు బాధ్యత వహిస్తారా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు.

తోటివారికి సేవ చేయడం ఆనందకరం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : సమా జంలో తోటి వారి పట్ల సానుకూల ఏర్పర్చుకుని అవసరం మేరకు సహాయం పడటం ఓ గొప్ప అనుభూతిని ఆనందాన్ని కల్గజేస్తుందని యువసూర్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎం.రాంబాబు అన్నారు. వేసవి దృష్ట్యా మూడు నెలల పాటు ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నిర్వహించామని, చలివేంద్రం వద్ద నీరు అందుబాటులో ఉంచుతు, వచ్చిన వారికి అందించి నిత్యం అందుబాటులో సేవలు అందిస్తున్న ఈశ్వ రమ్మ సేవా గుణం గొప్పదని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెకు దుశ్శా లువతో సత్కరించి కొంత నగదు, దుస్తులు, నిత్యవసరాలను సత్యసాయి పాఠశాల ఛైర్మన్ ఎస్.క్రిష్ణ మూర్తి, 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్‌ల చేతుల మీదుగా అందజేసారు. శక్తి వంచన లేకుండా ప్రతీ ఏటా యువసూర్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు నిర్వహించడం అభినందనీయమని అతిథులు రాంబాబును కొనియాడారు. సామాజిక సేవలు తనకు తోడుగా ఉండి సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికీ తాను ఋణపడి ఉంటానని యువసూర్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో భైరి, చిన్ని, ఈశ్వర రావు, వరదరాజు, అభిమన్యు సాహు తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరించి కిడ్నీ సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేద్దాం

నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దాసరి రాజు

విశాలాంధ్ర - కవిటి : ఉద్దాన ప్రాంతానికి పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక సమస్య కిడ్నీ వ్యాధి ని తరిమి కొట్టేందుకు లక్ష సంతకాలు సేకరణతో కిడ్నీ సమస్య శాశ్వత పరిష్కారానికి అడుగులు వేద్దామని ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జ్ దాసరి రాజు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మండలంలోని కుసుంపురం గ్రామంలో 16 ఏళ్ల బాలుడు జుత్తు ఓంకార్ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఈ విషయాన్ని పత్రిక ముఖంగా తెలియ జేస్తూ జుత్తు ఓంకార్ సంతకాన్ని 10వేలు సంతకంగా చేయించామని జన సైనికులు తెలిపారు. ఆట లాడుకుంటూ ఆనందంగా గడుపుకోవాల్సిన వయస్సులో కిడ్నీ వ్యాధికి గురి అయ్యి డయాలసిస్తో గడుపుతున్న ఓంకార్ కు దయాలసిస్ అవుతున్న పెన్షన్ వస్తుంది కానీ ప్రభుత్వము నుండి ఎటువంటి మందుల సహాయం లభించడం లేదని ఓంకార్ తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వాలకి, అధికారులకి ఇలాంటి విషయాలు తెలియజేయడానికే ఈ లక్ష సంతకాల కార్యక్రమం చేపట్టడం జరిగిందని కిడ్నీ సమస్య తో దయాలసిస్ అవుతున్న పదహారేళ్ళ ఓంకార్ సంతకం తో కిడ్నీ సమస్య పరిష్కారం కొరకు ఇచ్ఛాపురం జనసేన పార్టీ చేపట్టిన లక్ష సంతకాల సేకరణలో 10 వేలు సంతకాలు పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు.కావున నియోజక వర్గంలో ప్రజలు ఈ లక్ష సంతకాల సేకరణలో భాగస్వామ్యులు అయ్యి, మన ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేద్దాం అని దాసరి రాజు అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు డొక్కరి ఈశ్వరరావు, రోకళ్ళ భాస్కర్, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దుగాన దివాకర్,అంగ సురేష్, సోషల్ మీడియా అభ్యర్థి రామకృష్ణ, జనసేన నాయకులు రాజా,రాజు, సతీష్, చలపతి, నవీన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణమే ప్రపంచానికి రక్ష : మానవహక్కుల వేదిక ఉభయరాష్ట్రాల కన్వీనర్ వి.ఎస్.కృష్ణ

విశాలాంధ్ర - సోంపేట : పర్యావరణ పరిరక్షణే ప్రపంచానికి రక్ష అని మానవహక్కుల వేదిక ఉభయరాష్ట్రాల కన్వీనర్ విఎస్ కృష్ణ పేర్కొన్నారు. సోంపేట పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యమ అమరవీరుల దినోత్సవం డాక్టర్ వై.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పర్యావరణ ఆగ్రహానికి విలవిలలా డుతున్నాయని అన్నారు. ప్రస్తుతం భారతదేశంలో కూడా ఇటువంటి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని పేర్కొన్నారు. అటు ఉత్తర భారతావనిలో హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భారీ వర్షాల ధాటికి వేలాది మంది మృత్యువాత పడగా వందలాది భవనాలు నీటి ప్రవాహానికి కొట్టుకు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది కేరళ రాష్ట్రంలోను భారీ వర్షాలు పెనునష్టం కలిగించే విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకుని జనం విలవిలలాడారని అన్నారు. ఇటువంటి వాతావరణ మార్పులు భూమండలానికి పొంచి ఉన్న ప్రమాద సంకేతాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఈ భూమిపై నివశించే ప్రతి పౌరుడు బాధ్యతగా పర్యావరణ పరిక్షణకు నడుం బిగించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందని అన్నారు. సోంపేట బీల కూడా పర్యావరణ పరిరక్షణలో ఎంతో కీలక పాత్ర పోషించే ప్రాంతమని అన్నారు. ఇటువంటి వేలాది ఎకరాలను యధావిధిగా కాపాడు కోవల్సిన బాధ్యత మనందరిదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమూర్తితో పాటు జిల్లా మానవహక్కుల వేదిక కన్వీనర్ కె.వి.జగన్నాధరావు తదితరులు మాట్లాడారు.

అమరవీరులకు ఘన నివాళి : సోంపేట బారువ రోడ్డు పక్కన గల అమర వీరుల స్థూపం వద్ద జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని 2010 జులై 14న జరిగిన పోలీస్‌కాల్పుల్లో అమరులైన వారిని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని రామారావు, డాక్టర్ పి.శివాజీ, సనపల శ్రీరాములు, సూరాడ చంద్రమోహన్, వైశ్యరాజు నాగు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న తోనే పేదల ఆర్థికాభివృద్ధి

దువ్వాడ వాణి శ్రీనివాస్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని టెక్కలి నియోజక వర్గ వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి శ్రీనివాస్ అన్నారు. మండలం ఉమిలాడ, రంకుహనుమంతుపురం గ్రామాల్లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే, అన్ని వర్గాల సంక్షేమంతో పాటు నిరుపేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు కార్యకర్తలు ప్రజల సొమ్మును దోచుకున్నారని, ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి పాలలో ప్రభుత్వ పథకాలన్నీ మహిళల పేరిట పేద ప్రజలకి నేరుగా అందజేసి పేదలకు అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేరుగు. రాజేశ్వరి అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి.జగన్నా యకులు. (గోవిందరావు), స్థానిక సర్పంచ్ కెల్లి.లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ ల సంఘం అధ్యక్షుడు, మండల వైకాపా పార్టీ కన్వీనర్ కోత సతీష్, మండల వైస్ ఎంపీపీ ప్రతినిధి నక్క భీమారావు, సర్పంచులు జోగి రాములమ్మ, ఎన్ని మన్మధరావు, ఎంపీటీసీలు రాజు, అధికారులు పాల్గొన్నారు.

ఏఓగా భార్గవి



విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మండల వ్యవసాయ శాఖ అధికారిణిగా తారపు రెడ్డి భార్గవి నియ మితులైయ్యారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆమెను ఇక్కడ నియమించడంతో శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల పథకాలు వర్తింపజేసి, వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా భార్గవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర - ఎచ్చర్ల : మండలంలోని కేశవరావుపేట జంక్షన్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఎచ్చెర్ల గ్రామానికి చెందిన గుల్లిపల్లి జగ్గు నాయుడు (52) దుర్మరణం చెందారు. మధ్యాహ్నం రెండు గంటల, సమయంలో మోటారు ద్విచక్ర వాహనంతో శ్రీకాకుళం వైపు వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న క్వారీ లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. జగ్గు నాయుడు శ్రీకాకుళంలోని వికలాంగుల శాఖ కార్యాలయంలో పని చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె సాయి లక్ష్మి ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతుండగా, రెండో కుమార్తె లోహిత డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. మృతి ని భార్య జ్యోతి కూడా ఇదే జంక్షన్ లోనే నాలు గేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చని పోయింది తల్లిదండ్రులు ఇద్దరు వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందడంతో పిల్లలు దిక్కులేని వార య్యారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయిలు అలముకున్నాయి. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్ష సర్వేలను నిర్వహణ

విశాలాంధ్ర - పాతపట్నం : మేజర్ పంచాయతీ పరిధిలోని జగనన్న సురక్షా సర్వేలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వీధుల్లోని ప్రతి ఇంటికి నేరుగా వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, మహిళలకు, విద్యార్థుల కోసం అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. అర్హత ఉండి ఏ సంక్షేమ పథకమైన అందకపోతే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అలాగే ప్రభుత్వం జగనన్న సురక్షా కార్యక్రమంలో భాగంగా ఉచితంగా జారీ చేయనున్న 11 రకాల సర్టిఫికెట్లకు కావాలనుకున్న వారి నుండి దరఖాస్తులను తీసుకుని పైసా రుసుము వసూలు చేయకుండా సచివాలయంలో అందజే స్తున్నారు. దరఖాస్తుదారులకు జగనన్న సురక్షా క్యాంపుల్లో సర్టిఫికేట్స్ అందజేయనున్నారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ వనజ, వలంటీర్ పిన్నింటి శివాజీ ఇంటింటికి వెళ్లి సురక్షా సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

జిల్లోడి పేటలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - హిరమండలం : మండలం లోని జిల్లోడు పేట గ్రామం లో శుక్రవారం సాయింత్రం పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి శాంతి 178వ రోజు గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రాజకీయపార్టీ లకు అతీతంగా సంక్షేమ పదకాలను అందిస్తూ ప్రజలు మన్ననలు పొందు తున్నారని అన్నారు. పాలన అంటే జగన్ మోహన్ రెడ్డే చేయగలరని దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి మన సీఎం చేసి చూపించారని మళ్ళీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ని, పాతపట్నం నియోజకవర్గం లో రెడ్డి శాంతి అనే నన్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, తహసీల్దార్ బి మురళి మోహన్, ఎం ఎల్ ఓ సి హెచ్ రాజా, పొట్నూరు సింహాచలం వైస్సార్సీపీ నాయకులు వెలమల బాలరాజు, నక్క ఆనంద్, గ్రామస్థులు వైస్సార్సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడవులే అన్నింటికీ మూలాధారం : ఎఫ్‌ఆర్ఓ యశస్వి

విశాలాంధ్ర - పాతపట్నం : మండల కేంద్రంలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాలలో "భూమిని రక్షించుట" అనే పేరుతో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వన్యప్రాణి సంరక్షణ, అడవులను కాపాడుట అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ యశస్వి, బీట్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవుడు తమ కనీస అవసరాలను తీర్చుకునే విధంగా తమకు తామే ముందుకు వచ్చి అడవులను కాపాడుకోవాలని, అన్నింటికీ మూలాధారం అడవులే అని అలాగే పర్యావరణ ప్రాముఖ్యత గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో తమకు ఉన్నటువంటి సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ నాగరాజు,ప్రిన్సిపల్ ప్రభాకర్,ఉపాధ్యాయ సిబ్బంది, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా అర్హులకు న్యాయం

ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని అర్హులకు న్యాయం జరుగుతుందని మండలపరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వర రావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులు అన్నారు. మండలం కొత్తపేట సచివాలయం వద్ద ఎంపీడీవో కె. ఫణీంద్ర కుమార్, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మల ఆద్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.లబ్ధిదారులకు ఫ్యామిలీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ళలో అనేక పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులు ఎవరికైనా పథకాలు అందని వారు ఉంటే గుర్తించి వారికి కూడా అందించటం జరుగు తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరో సారి వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు దుక్క రోజారామక్రిష్ణ, స్థానిక సర్పంచ్ ఆర్. శివారెడ్డి, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ ఎస్. హేమసుందరరాజు, మండల కో-ఆపర్సన్ మెంబర్ షేక్ రాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తెప్పలకు బంగారు తెలంగాణ అవార్డు

విశాలాంధ్ర - పలాస : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరా బాద్ ఆదర్శ నిలయం ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ దేవుల్లపల్లి రామానుజ రావు కళామందిరంలో పలాస కాశీబుగ్గకు చెందిన రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.తెప్పల కృష్ణమూర్తికి బంగారు తెలంగాణ అవార్డుతో పాటు జ్ఞాపిక, ప్రశంసపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు చెరాల ప్రకాశ్, టి.సి సభ్యులు డా.మాణిక్, దేవజ్ఞ శర్మ, సినీ, టి.వి నటులు డా.అశోక్ కుమార్, సినీ హీరో విజయ భాస్కరరావు, దివ్యవాణిలు పాల్గొన్నారు.

వార్షిక తనిఖీలు నిర్వహించిన ఎస్పీ రాధిక

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం నౌపడ పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక వార్షిక తనిఖీలను శుక్ర వారం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులతో ఎస్పీ సమావేశం నిర్వహించి, వారు నిర్వహించే విధుల పట్ల పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళల రక్షణ, పోక్సో చట్టం, దిశ యాప్‌లపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని, నాటుసారా, మద్యం, గంజాయిల అక్రమ రవాణా, విక్రయాలుకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ రికార్డులను, ముఖ్యమైన కేసు ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. కానిస్టేబుళ్ల వారి దత్తత గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరుగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు.

బయోమెడికల్ వ్యర్థాలును శాస్త్రీయంగా వేరుచేయాలి

జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : బయోమెడికల్ వ్యర్థాలును శాస్త్రీయంగా వేరుచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. బయో మెడికల్ వ్యర్థాలును శాస్త్రీయంగా వేరుచేసి, ఆసుపత్రి ఆవరణలో నిల్వ చేసే ప్రదేశంలో కెమెరాలు అమర్చి వాటిని కలుష్య నియంత్రణ మండలి వారికి పర్యావేక్షన కోసం అనుసంధానం చేయాలని తెలిపారు. రోజువారీ పడకల వివరాలు వాటి వలన ఉత్పన్నమైన వ్యర్థాలను శాస్త్రీయంగా వేరుచేసి, తదుపరి వాటిని రెయిన్బో ఇండస్ట్రీ వారికి అందజేయాలని వాటి వివరాలను కూడా ఆసుపత్రి వారు వెబ్సైటులో నమోదు చేయాలనీ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. బయో మెడికల్ వ్యర్థాలను మునిసిపల్ వ్యర్థాలతో జతచేయకుండా పర్యవేక్షించాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలుష్యనియంత్రణ మండలి ఈ ఈ శ్రీమతి. ఎం.వి.పద్మావతి, జిల్లా వైద్యాధికారిణి డా.బి. మీనాక్షి, ఇతర అధికారులు మరియు జిల్లాలోని వివిధ ఆసుపత్రి యాజమాన్యలు, వైద్యలు పాల్గొన్నారు.

మోడల్ పద్ధతిలో కూరగాయల సాగు

విశాలాంధ్ర - గార : మండలం చల్లపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు చేత మోడల్ పద్ధతిలో (ఏటీఎం- మోడల్ ఎనీ టైం మనీ అనగా నిత్యం ఆదాయం) కూరగాయలు సాగును వేయించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ నాయుడు మాట్లాడుతూ రైతులు మామూలుగా ఒకే రకమైన పంట వేసుకొని పండించడం వలన ఆదాయం ఎక్కువగా ఉండదని, ఈ విధంగా మోడల్ పద్ధతిలో కూరగాయలను సాగు చేయడం వలన ప్రతినిత్యం ఆదాయం అనేది ఉంటుందని అన్నారు. ఇందులో 10 నుండి 15 రకాల కూరగాయ పంటలను సాగు చేసేలా నిర్దిష్టమైన కొలతలు తీసుకుని వివిధ రకాల విత్తనాలను వేసుకొని ఏడాది పొడుగునా ఆదాయంతో పాటుగా కుటుంబాలకు అవసరమైన మంచి పోషక విలువలతో కూడిన కూరగాయలను పొందవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అందువలన రైతులందరూ కూడా ఒకే రకమైన పంటలను పండించకుండా వివిధ రకాల పంటలను కలిపి వినూత్న పద్ధతిలో పలు రకాల మోడల్స్ లో వేసుకొని సాగు చేయడం వలన అధిక ఆదాయాన్ని పొందవచ్చునని వివరించారు.

ప్లాస్టిక్ వినియోగం హానికరం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : సాంకేతిక పెరిగిన క్రమంలో సౌలభ్యం కోసం సృష్టించుకున్న అనేక విధానాలు మానవులు, పశు పక్షాదుల మనుగడపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢి, బోటనీ లెక్చరర్ తెలుకల బృంధావన్‌లు అన్నారు. రవీంద్రభారతి స్కూల్‌లో నేల పరిరక్షణ-కాలుష్య నివారణ-మెక్కల పెంపకం పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్న క్రమంలో ఎదురవుతున్న దుష్ప్రభాలను వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేల, వాతావరణం కలుషితమైపోతుందని, క్యారీ బ్యాగుల వల్ల ఆరోగ్యం హానికరం అవతుందని తెలిపారు. మెక్కల పెంపక ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమని ప్రతీ ఒక్కరు మెక్కలు పెంచుకోవడం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శివకుమార్, రామక్రిష్ణ, జెన్న, సంతోష్‌కుమార్, దుర్యోధన, దేవరాజు, గణపతి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమ అక్రమ లాకౌట్ ఎత్తి వేయాలి

విశాలాంధ్ర - మందస : జీడి పరిశ్రమల ఉత్పత్తిదారులు చేస్తున్న అక్రమ బంద్‌ను వెంటనే ఎత్తి వేయాలని, లాకౌట్ కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లిం చాలని సంఘం నాయకులు వి.తేజేశ్వరరావు, ఎన్.గణపతిలు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులతో ధర్నా చేపట్టి తహశీల్దార్ బడే పాపా రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 350 జీడి పరిశ్రమలున్నాయని, అందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 50వేల మంది కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. వీరికి కనీస వేతనాలు, పి.ఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యూటీ వంటి చట్టపరమైన రాయితీలు ఏ ఒక్కటి జీడి పరిశ్రమ ఉత్పత్తిదారులు అమలు చేయకుండా ఏళ్ల తరబడి కార్మికులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపధ్యంలో పరిశ్రమ యాజ మాన్యాలు జూలై 5 నుంచి అక్రమ లాకౌట్ ప్రకటించాయని, దీని వలన వేలాది మంది జీడి కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు బంద్‌తో కార్మికులకు రెండో వైపు జీడి కొనుగోలు ధర లేకుండా రైతాంగాన్ని దెబ్బ తీసే ఎత్తుగడలు పన్నుతున్నారని అన్నారు. పరిశ్రమలు బంద్ చేస్తే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జీడి పరిశ్రమదారులు అడుగుతున్న నాటకాన్ని ప్రజలు, ప్రజాతంతరవాదులు ఖండించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి బంద్ జీడి పిక్కలను మార్కెట్ ఇంటర్‌వెర్షన్ పథకం ద్వారా 16వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బికె ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేశవరావు, ఆర్.దిలీప్‌కుమార్, జి.బాలమ్మ, ఎస్.సరస్వతి, ఎం.కళావతి, వి.పద్మ, దానమ్మ, కె.బాలక్రిష్ణ, ఎం.ధర్మారావు, ఆర్.ఎకాశి, టి.దుర్యోదనలు పాల్గొన్నారు.

వైకాపా నాయకులు వాలంటీర్లును రెచ్చగొట్టడం సరికాదు

టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకుడు కోటేశ్వరరావు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : జనసేన పార్టీ అదినేత పవన్‌కళ్యాణ్ వాలంటీర్లును ఉద్దేశించి మాట్లాడిన మాటలను వైకాపా నాయకులు తప్పుగా దుష్ప్రచారం చేసి వారికి రెచ్చకొడుతున్నారని టెక్కలి నియోజకవర్గ నాయకుడు కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండల పార్టీ నాయకులతో కలిసి విలేకర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం అభివృద్ధి మీద ఏ మాత్రం చిత్తశుద్ధి లేకుండా అవినీతే లక్ష్యంగా నైపుణ్యం కలిగిన లక్షలాది మంది యువతను కేవలం 5000 రూపాయలు ఇచ్చి, వెట్టి చాకిరీ చేయిస్తు, యువతను వైసీపీ కార్యకర్తలుగా మార్చే ప్రయత్నము చేస్తున్నారు. యువతను నిరుద్యో గులుగా మార్చుతున్నారు. ఉద్యోగ క్యాలెండర్ లేదు, ఉపాధి అవకాశాలు లేవు, అభివృద్ధి లేదని ఇలా ఏ ఒక్క సిద్ధాంతాలపైన మాట్లాడ లేని వైసీపీ నాయకులు పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగత దూషణలకు దిగి, యువకులకు రెచ్చగొట్టి యువతను ప్రక్క తోవ పట్టిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు భేసరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. అనతరం హలో ఏపీ... బాయ్‌బాయ్ వైసీపీ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు జనార్దన్, ప్రసాద్, వినోద్, చందు, భాస్కర్, చిరంజీవి సందీప్, పవన్ ధనరాజ్ జనసైనికులు తేజ, సందీప్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రెంటికోట గ్రామం అభివృద్ధి

విశాలాంధ్ర - పలాస : వైసీపీ పాలనలో రెంటికోట గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని, అందుకు సర్పంచ్ శాసనపురి తిరుమల రావు ఎంతో కృషి చేశారని పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ అన్నారు. మండలంలోని రెంటికోట గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రెంటికోట గ్రామంలో ఎప్పుడూ డయేరియా, విష జ్వరాలు, పారిశుధ్య లోపం ఎక్కువగా ఉండేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించక పోయినా ప్రజలకు ఇబ్బందులు పడకుండా ముందుగా డబ్బులు వెచ్చించి పనులు చేపట్టడం గొప్ప విషయమన్నారు. శత శాతం ప్రభుత్వ పథకాలు అందించాలని లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసనపురి తిరుమల రావు, వైస్ ఎంపీపీ సవర దాలమ్మ, ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, తహశీల్దార్ ఎల్.మధుసూదన్‌రావు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, ఎఓ పోలారావు, సద్గుణ బాబు, వైసిపి నాయకులు ఖగేశ్వరరావు దొర, చింతాడ మాధవరావు, వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11 మంది ట్రిపుల్ ఐటి విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర - హిరమండలం : మండలంలోని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల లో 2022-23 విద్యా సంత్సరంనకు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన 11 విద్యార్థులకు వారి తల్లిదండ్రులు మండల విద్యా శాఖధికారి కిలారి రాంబాబు, హిరమండలం జీహెచ్ స్కూల్‌లో శుక్రవారం సన్మాంచి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి కిలారి రాంబాబు మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డంకి కాదని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కు సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అందిస్తూ న్నారని, బ్యాగ్‌లు, పుస్తకాలు, బూట్లు, అమ్మ ఒడి ఇలా ఎన్నో ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికే ట్రిపుల్ ఐటి సీట్లు కూడా వస్తున్నాయని, ఈ ఏడాది అధిక మొత్తంలో 11 మంది సీట్లు సాధించడం చాలా గర్వంగా ఉందని ఉపాధ్యాయులను విద్యా ర్థులను ఈ సందర్భంగా అభినందనలు ఏంఈఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.మురళి మోహన్, కేజీబీవీ ఎస్ఓఎస్ కృష్ణ వేణి, హిరమండలం ప్రాథమికొన్నత పాఠశాల హెచ్ఎం టి.కేశవరావు, తంప స్కూల్ హెచ్ ఎంఎస్ రామకృష్ణ, ఆవలింగి పాఠశాల హెచ్ ఎంవై.రామారావు, చైర్మన్ గొర్లె కృష్ణవేణి,, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా లబ్ది : ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్

విశాలాంధ్ర - కవిటి : జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు లబ్ధి చేకురుతుందని ఎంపీపీ ప్రతినిధి కడి యాల ప్రకాష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కుసుంపురం గ్రామంలో స్థానిక సర్పంచ్ ఊర్మిల శివ బిశాయి అధ్యక్షతన తాసిల్దార్ పి శేఖర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామసభలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశామని ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. ప్రజలకు అవసరమైన 11రకాల దృవీకరణ పత్రాలను సిబ్బంది గుర్తించి ఉచితంగా అందజేస్తున్నరని తెలిపారు. సాధారణంగా కుల, ఆదాయ, కుటుంబ, రేషన్ కార్డు విభజన వంటి దృవీకరణ పత్రాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య,ఎంపీటీసీ సభ్యులు కర్రీ పద్మ సత్యనారాయణ, ఈవోపీఆర్డి శివాజీ పాణిగ్రహి, మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ కన్వీనర్ శ్రీను, బాలయ్య, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర - మెళియాపుట్టి : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఏ.పి.టి.ఏఫ్. మెళియాపుట్టి మండలశాఖ అధ్యక్షులు టి.కామేశ్వరరావు అన్నారు. మండలంలో గల గొప్పిలి పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న గొప్పిలి, గోకర్ణ పురం, చిన్నహంస, కరజాడ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గొప్పిలి, కరజాడ, భరనికోట తదితర పాఠశాలలను సందర్శించి అక్కడ ఉపాధ్యాయులతో కలిసి సంఘ బలోపేతం గూర్చి మాట్లాడటంతో పాటు సభ్యత్వా నమోదులు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఓల్డ్ పెన్షన్ స్కీమ్ సాధన, డిఏ పెండింగులు, పి.ఆర్.సిలో నష్టపోయిన బకాయిలు, పిఎఫ్ పార్ట్, ఫైనల్ మరియు స్కూల్ అసిస్టెంట్ లకు రావాల్సిన జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్స్ వంటి వివిధ సమస్యలను తెలుసుకొని చర్చించి వాటి పరిష్కా రానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఢిల్లీశ్వరావు, సంఘం జిల్లా కౌన్సిలర్ ధర్మారావు, కార్యవర్గ ఆడిట్ సభ్యులు గోపాలకృష్ణ తదితరులున్నారు.

కొర్లాం పిహెచ్‌సి పున:ప్రారంభం

విశాలాంధ్ర - సోంపేట : ఈమండలం కొర్లాం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు జెడ్పీటీసీ తడక యశోద డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ శుక్రవారం పున: ప్రారంభించారు. డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో కొర్లాం పిహెచ్‌సి అన్ని హంగులతో ఆధునీకరించిన నేపథ్యంలో దీన్ని పున:ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యత ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ ఆపరేటింగ్ ఆఫీసర్ పవన్‌కుమార్, ఆసోసియేట్ డైరెక్టర్ జోగారావు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.సురేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తడక జోగారావు, బుద్దాన శ్రీకృష్ణ, శంకరరావు,మోహనరావు, పాపారావు, వైద్యాధికారులు సౌజన్య, వందిత పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం విజయవాడ దాసర భవన్‌లో గురువారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు జెవి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్సీ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బట్టు రాయప్ప, ఆఫీస్ ఆఫీస్ బేరర్స్ నాగరాజు, గురుదాస్, కళింగ లక్ష్మణరావు, యడ్ల గోపి, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం

గరిమెళ్ళ పై గౌరవం ఉంటే ప్రెస్ క్లబ్ తెరిపించండి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జాతీయ గేయ కవిత సార్వభౌముడిగా ఆచార్య ఎన్జీ రంగా వంటి నాయకునితో ప్రశంసలు అందుకున్న గరిమెళ్ళ సత్యనారాయణకు శుక్రవారం ఉదయం శ్రీకాకుళంలో జర్నలిస్టు నాయకులు ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు చింతాడ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ, గరిమెళ్ళ జీవిత, స్వాతంత్రోద్యమ చరిత్రను గుర్తు చేశారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఒక పాట రాసినందుకు, పాడినందుకు దేశద్రోహం నేరం మోపి జైలుకు వెళ్లిన కవి మన దేశంలో ఒక్క గరిమెల్లగారేనని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకుల శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వాలు గరిమెళ్ళను విస్మరించడం అన్యాయం అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం గరిమెళ్ళ సాహిత్యాన్ని, గీతాల్ని వెలుగులోకి తెచ్చిందని, తొలిసారి మంత్రిగా ఉన్నప్పుడు ధర్మాన ప్రసాదరావు ఇందుకు సహకరించారని చెప్పారు. శ్రీకాకుళంలో ప్రెస్ క్లబ్ భవనం నిర్మాణం టిడిపి ప్రభుత్వ హయాంలోనే జరిగినా, ఆ ప్రభుత్వ హయాంలోనే మూత వేయించారన్నారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్లో ప్రతిభ

అభినందించిన సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు.

విశాలాంధ్ర - కవిటి : రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో బెలగాం పంచాయతీకి లోని జాదుపూడి ఆర్ఎస్ గ్రామానికి చెందిన ఆసి.మణికంఠ రెడ్డి (20) ప్రతిభ చూపారు. హైదరాబాద్ లో గత నెల 23 నుంచి వారం రోజుల పాటు యూత్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో వివిధ అంశాలపై రైఫిల్ షూటింగ్ పోటీలు జరిగాయి. మణికంఠ రెడ్డి మొత్తం తొమ్మిది అంశాల్లో పోటీ పడి, ఆరు స్వర్ణ పతకాలు, ఓ రజత పతకం సాధించారు. విజేతల వివరాలను ఈనెల 7వ తేదీన రావ్ సంస్థ ప్రకటించింది. సోమవారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో రావ్ అధ్యక్షులు తొట్టెంపూడి సలలిత్, రావ్ కార్యవర్గం సభ్యుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. విశాఖ వచ్చిన మణికంఠ రెడ్డిని శుక్రవారం బెలగాం సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, జి బెలగాం గ్రామ పెద్దలు, బసవ కొత్తూరు మాజీ సర్పంచ్ అభినందించి ఘనంగా సత్కరించారు. మణికంఠ రెడ్డి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మద్దిలి ఈశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.